సాక్షి ప్రకాశం

మంగళవారం ၊ 23 ၊ జూలై ၊ 2024



మహిళలపై ఘోరాలు సిగ్గుసిగ్గు

రాష్ట్రంలో గత 40 రోజుల్లో 20 మంది మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరిగాయని సీపీఎం నేతలు విమర్శించారు.

- 8లో..



పెండింగ్ పనులు పూర్తిచేయాలి

ఒంగోలు-కొత్తపట్నం రహదారిలో బకింగ్ హాం కెనాల్ బ్రిడ్జి పెండింగ్ పనులు పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

- 8లో..


గరిష్టం/కనిష్టం
34/26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

ఏకేయూ ఇన్‌చార్జి వీసీగా డీవీఆర్ మూర్తి బాధ్యతల స్వీకరణ



డీవీఆర్ మూర్తి

ఒంగోలు: ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్‌గా డీవీఆర్ మూర్తి సోమవారం సాయంత్రం యూనివర్శిటీ వీసీ ఛాంబరులో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన యూనివర్శిటీకి ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. అడ్మిషన్లు బాగా పెంచి స్థానిక విద్యార్థులకు, ప్రజలకు అవసరమైన విద్యను అందించేందుకు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ముందుకు వెళతామన్నారు. అవసరమైన సిబ్బంది నియామకం, భవనాలు నిర్మాణం, ఆర్థిక పరమైన వనరులు ఏర్పాటు విషయంలో రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని కోరారు. వందేళ్ల చరిత్ర ఉన్న ఆంధ్రా యూనివర్శిటీ కూడా ప్రారంభంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొందని, ప్రస్తుతం సదరు యూనివర్శిటీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, వివిధ రకాల కోర్సులు, సిబ్బందితో కళకళలాడుతుందన్నారు. ఆంధ్రకేసరి యూనివర్శిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ముందుకు సాగుతామన్నారు. అవసరాలకు అనుగుణంగా నూతనంగా కోర్సులు ప్రారంభించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు, బోధన, బోధనేతర సిబ్బంది, డిగ్రీ, బీఎడ్ కళాశాలల యాజమాన్యాలు పలువురు కలిసి వీసీని సత్కరించారు.

ఆకాశవాణిలో క్యాజువల్ అనౌన్సర్ల పోస్టులకు దరఖాస్తులు



ప్రోగ్రామ్ హెడ్ ప్రశాంత్ కిరణ్

మార్కాపురం: మార్కాపురం ఆకాశవాణి కేంద్రంలో క్యాజువల్ అనౌన్సర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రోగ్రాం హెడ్ పీ ప్రశాంత్‌కిరణ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు మార్కాపురం పట్టణ, పరిసర ప్రాంతాల వారై ఉండాలని, తెలుగుభాషపై పూర్తి అవగాహన, మంచి కంఠ స్వరం కలిగి ఉండాలన్నారు. ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ పాసై ఉండాలని, తెలుగు సాహిత్యం, చరిత్ర, సంస్కృతి సమకాలీన రాజకీయ, ఆర్థిక అంశాలపై పట్టు కలిగి ఉండాలని చెప్పారు. గుర్తింపు పొందిన సంస్థల నుంచి కంప్యూటర్ పరిజ్ఞానం సర్టిఫికెట్లు ఉండాలన్నారు. 2024 సెప్టెంబరు 1 తేదీ నాటికి 20 నుంచి 50 ఏళ్లలోపు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులతోపాటు పదో తరగతి, డిగ్రీ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలు, లేటెస్టు పాస్‌పోర్టు సైజు 3 ఫొటోలు, ఆధార్‌కార్డు జిరాక్స్ జత చేసి పంపాలని అన్నారు. ఓపెన్ క్యాటగిరీ అభ్యర్థులు రూ.354, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు రూ.266 బ్యాంకు అకౌంట్ నంబరు 31122924901- ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్ 0003055 నెఫ్ట్‌ద్వారా చెల్లించి రసీదును జతపరచాలి. ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు తమ ధ్రువీకరణ పత్రాలు అటెస్టేషన్ చేయించి దరఖాస్తు ఫారంతో జతపరచాలి. అభ్యర్థుల ఎంపిక మూడు దశల్లో ఉంటుందని, రాత పరీక్ష, స్వర పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేస్తామని అన్నారు. రాత పరీక్షలో ఎంపికైన అభ్యర్థులను వాయిస్ టెస్టుకు పిలుస్తామని, ఈ రెండు పరీక్షల్లో పాసైన వారిని ఇంటర్వ్యూకు పిలుస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ బయోడేటాను వచ్చేనెల 5వ తేదీ సాయంత్రం 6 గంటల్లోగా మార్కాపురంలోని ఆకాశవాణి కేంద్రానికి చేర్చాలన్నారు. ఈ నియామకాలన్నీ అసైన్‌మెంటు పద్ధతిలోనే ఉంటాయని తెలిపారు. శాశ్వత ఉద్యోగాలు కావన్నారు. ఎంపికైన అభ్యర్థులు షిఫ్ట్ పద్ధతిలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను వచ్చేనెల 5వ తేదీలోపు మార్కాపురంలోని ఆకాశవాణి కేంద్రానికి పంపాలని తెలిపారు.


ఉపాధి హామీ కూలీల వేతనాల బకాయిలివ్వండి

ఒంగోలు టౌన్: రెండు నెలలకు పైగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ కూలీల వేతనాలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయంలో పీడీ అర్జునరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు నెలల తరబడి వేతనాలు ఇవ్వకుండా తిప్పుకోవడం అమానుషమన్నారు. జిల్లాలో రూ.40 కోట్ల వేతనాలు బకాయిలు ఉన్నాయని, వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. ఉపాధి హామీ పనులు ఏడాదికి 200 రోజులకు పెంచాలని, కనీసం వేతనం రూ.600 ఇవ్వాలని కోరారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా సంతనూతలపాడు, చీమకుర్తి, మద్దిపాడు, నాగులుప్పలపాడు, పామూరు, కొండపి, హెచ్ఎంపాడు, సీఎస్‌పురం మండలాల్లో వేతనాల కోసం నిరసన ప్రదర్శనలు చేసినట్లు తెలిపారు.

నెరవేరుస్తారా.. దాటవేస్తారా?

'అధికారంలోకి వచ్చిన వెంటనే మార్కాపురాన్ని జిల్లా చేస్తా.. అద్దంకి, కందుకూరును ప్రకాశం జిల్లాలో కలుపుతా' అంటూ చంద్రబాబు సూపర్ సిక్స్‌తో పాటు ఎక్కడికక్కడ హామీలు గుప్పించారు. అధికారం చేజిక్కాక ఆ ఊసేలేదు. ఇక నియోజకవర్గాల వారీగా కూటమి నేతలు సైతం ఎన్నో హామీల వర్షం కురిపించారు. వాటి అమలుకు అసెంబ్లీ వేదికగా చర్చించి నిధులు తీసుకొస్తారా? ఎప్పటిలాగే మేనిఫెస్టో అమలును గాలికొదిలేస్తారా? అంటూ జిల్లా వాసుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సందర్భంగా ఎన్నికల్లో చంద్రబాబు అండ్ కో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని జిల్లా ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

- ప్రతి హామీ అమలు చేయాలి
- మళ్లీ మోసం చేస్తే ఊరుకోం
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన, ఇవ్వని హామీలు అమలు చేసింది
- అంతకంటే ఎక్కువగా ఇస్తామంటే గెలిపించాం
- అధికారంలోకి వచ్చిన వెంటనే మార్కాపురం జిల్లా అంటూ చంద్రబాబు హామీ



వెలిగొండ ప్రాజెక్టు

సాక్షి ప్రతినిధి ఒంగోలు/ఒంగోలు అర్బన్:

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను దాదాపుగా నెరవేర్చింది. మేనిఫెస్టోలో పేద, బలహీన వర్గాల ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడంతో పాటు, ఇవ్వని హామీలను కూడా ఆచరణలో పెట్టిన సంగతి తెలిసిందే. అయితే ఎన్నికలప్పుడు ఇబ్బడిముబ్బడిగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చింది కూటమి ప్రభుత్వం. మార్కాపురాన్ని జిల్లా చేస్తామని, అద్దంకి, కందుకూరును ప్రకాశం జిల్లాలో కలుపుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. అంతేకాకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రారంభించిన వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి పశ్చిమ ప్రాంత ప్రజలకు నీటిని అందజేస్తారో లేదో చూడాలి. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలే కాకుండా, జిల్లాను అభివృద్ధి చేస్తామంటూ పెద్ద సంఖ్యలో హామీలు ఇచ్చారు. ప్రస్తుతం సంక్షేమ పథకాల అమలుకే నిధులు లేవంటూ పాలకులు కుంటిసాకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో కూటమి నేతలు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు అసెంబ్లీలో చర్చించి నిధులు తీసుకొస్తారా? లేక ఎప్పటిలాగే చూపుతూ దాటవేస్తారా అని ప్రజల్లో చర్చ జరుగుతోంది.

జిల్లా కేంద్రంలో..

గత ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాలను తొలగించి ఒక్కో లబ్ధిదారునికి 2 సెంట్ల చొప్పున ఇంటి స్థలం ఇస్తామని స్థానిక ఎమ్మెల్యే దామచర్ల ప్రజలకు హామీ ఇచ్చారు. అదేవిధంగా టిడ్కో గృహాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. నగరంలో పోతురాజు కాలువ ఆధునికీకరణ, అండర్ గ్రౌండ్ డ్రైనేజి, ఫిషింగ్ హార్బర్ పూర్తి చేస్తామని ప్రజలకు మాట ఇచ్చారు. నగర ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా గుండ్లకమ్మ జలాశయం నుంచి ఒంగోలుకు పైప్‌లైన్ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వీటి నిధుల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తారా? అంటూ నగర వాసులు ప్రశ్నిస్తున్నారు.

జిల్లా ఏర్పాటుపై ఆశలు...

ఎన్నికల సందర్భంగా ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబునాయుడు ఆయన తనయుడు లోకేష్ మార్కాపురానికి వచ్చినప్పుడు మార్కాపురాన్ని కచ్చితంగా జిల్లాగా ఏర్పాటు చేస్తామని బహిరంగ సభల్లో మాటిచ్చారు. నూతన ప్రభుత్వం ఏర్పాటై దాదాపు 50 రోజులు కావొస్తోంది. జిల్లా కేంద్రమైతే కేంద్ర ప్రభుత్వం నుంచి వెనుకబడిన జిల్లాల అభివృద్ధి పథకం కింద ప్రత్యేక నిధులు రావడంతోపాటు కలెక్టర్, ఎస్పీ, ఇతర ఉన్నతాధికారులు కూడా ఇక్కడే నివాసముండటం వలన పశ్చిమ ప్రకాశం అభివృద్ధి చెందుతుందని పశ్చిమ ప్రాంత ప్రజలు ఆశపడ్డారు. అయితే అధికారంలోకి వచ్చాక ఇంత వరకూ ఎలాంటి ప్రకటన చేయకపోవడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు.

పునరావాసం కోసం ఎదురుచూపులు...

వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ముంపునకు గురవుతున్న గొట్టిపడియ, అక్కచెరువు తాండ ప్రజలు ఆర్‌ఆర్ ప్యాకేజీ అమలు కోసం పునరావాస కాలనీల ఏర్పాటు కోసం ఎదురుచూస్తున్నారు. దీంతో నూతన ప్రభుత్వంపై రైతులు త్వరగా వెలిగొండ ప్రాజెక్టు నీటిని అందించేలా ఈ ప్రాంత ఎమ్మెల్యేలు కృషిచేయాలని కోరుతున్నారు. ఇప్పటికే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణ పనులను పూర్తి చేసింది. దీనిపై ప్రభుత్వ పెద్దలు దృష్టిసారించి త్వరతగతిన నీళ్లు ఇవ్వాలని కోరుతున్నారు. సుమారు నాలుగున్నర లక్షల ఎకరాలకు సాగునీరు. 15 లక్షల మంది ప్రజలకు తాగునీరు లభిస్తుంది.

మెడికల్ కాలేజీపై ప్రత్యేక దృష్టి...

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూ.475 కోట్లతో మెడికల్ కాలేజీ నిర్మాణం చేపట్టింది. నిజానికి ఈ ఏడాది సెప్టెంబరు నుంచి ఎంబీబీఎస్ మొదటి సంవత్సర అడ్మిషన్ల ప్రక్రియకు సిద్ధం చేయాలని భావించింది. కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని సత్వరం పూర్తిచేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఇందులో భాగంగా మార్కాపురంలోని జిల్లా వైద్యశాలను జీజీహెచ్‌గా మార్చి సుమారు 72 మంది వైద్యసిబ్బందిని నియమించి 450 బెడ్లను ఏర్పాటు చేసింది గత ప్రభుత్వం.

- కనిగిరి నియోజకవర్గంలో పట్టి పీడిస్తున్న ఫ్లోరైడ్ సమస్యను పరిష్కరిస్తామని, అందుకు వెలిగొండ ప్రాజెక్టు ద్వారా నీటిని అందచేస్తామని కూటమి నేతలు ప్రజలకు హామీ ఇచ్చారు. అంతేకాకుండా కనిగిరి పట్టణానికి రూ.130 కోట్ల సమగ్ర రక్షిత పథకం కొనసాగిస్తూ ఆరు మండలాలకు సురక్షిత జలాలు ఇచ్చేందుకు రూ.400 కోట్లతో వాటర్ గ్రిడ్ స్కీం కూడా కొనసాగిస్తామని, నిమ్జ్, ట్రిపుల్ ఐటీ వంటివి పూర్తి చేస్తామని హామీలు ఇచ్చారు. వీటి అమలుకు నిధులు తీసుకురావాలని ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డిని ప్రజలు కోరుతున్నారు.

గ్రానైట్ రాయల్టీ తగ్గింపు..

చీమకుర్తి, బల్లికురవ, మద్దిపాడులోని గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లలోని పలు గ్రానైట్ క్వారీలు, వేలాది సంఖ్యలో గ్రానైట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. వాటిపై ప్రభుత్వం ప్రస్తుతం వసూలు చేస్తున్న రాయల్టీలో కనీసం 15 శాతం తగ్గించినట్లయితే క్వారీ యజమానులు, ఫ్యాక్టరీ యజమానులకు ఎంతో ఉపశమనం కలుగుతుందని యజమానులు ఆశగా ఎదురు చూస్తున్నారు. దాంతో పాటు కరెంటు వినియోగంపై యూనిట్‌కు కనీసం రూ.2 నుంచి రూ.3 వరకు తగ్గించినట్లయితే నష్టాల్లో ఉన్న ఫ్యాక్టరీ యజమానులు ఊపిరి పీల్చుకునే అవకాశం ఉందంటున్నారు.

పరిశ్రమలకు రాయితీలు అందించాలి...

సంతనూతలపాడు నియోజకవర్గం పరిధిలో పారిశ్రామికవాడగా ప్రసిద్ధి చెందింది. చీమకుర్తి, సంతనూతలపాడు, పేర్నమిట్ట, మద్దిపాడు, బూదవాడ, మర్రిచెట్లపాలెం పరిధిలోని గ్రానైట్ ఫ్యాక్టరీలు, ఇతర ఎంఎస్ఎంఈఓ యూనిట్లకు చెందిన చిన్న, మధ్య తరహా, మేజర్ పరిశ్రమలకు చెందిన యజమానులకు రావాల్సిన ప్రోత్సాహకాలను వేసినట్లయితే ఆయా పరిశ్రమల్లో నూతనోత్సాహం వస్తుందని ఆయా సంస్థల యజమానులు చెబుతున్నారు. దాని వలన వారి సంస్థల్లో ఉద్యోగుల సంఖ్య పెరిగి నిరుద్యోగ సమస్య తగ్గుతుందని ఆయా సంస్థల యజమానులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

దోలా హామీలెన్నో..

సార్వత్రిక ఎన్నికల వేళ కొండపి నియోజకవర్గ ప్రజలకు ప్రస్తుత సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ఇబ్బడిముబ్బడిగా హామీలిచ్చారు. సంగమేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేస్తానని, పాలేరు, మన్నేరు, ముసి పై చెక్‌డ్యాంలు నిర్మిస్తానని, సింగరాయకొండ మండలంలోని సుమారు 10 వేల ఎకరాలకు ప్రధాన సాగునీటి వనరైన పాలేరు-బిట్రగుంట స్కీము సప్లయ్ ఛానల్ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వీటిని నెరవేర్చేందుకు కృషి చేయడంతోపాటు పాకల బీచ్ పర్యాటకంగా అభివృద్ధి చేయాలని, మర్రిపూడి మండలంలో ఫ్లోరైడ్ సమస్య పరిష్కరించాలని, జిల్లెళ్లమూడి రిజర్వాయర్‌లో ఇసుక మేటలు తొలగించి పీటీ చానల్ ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

ముత్తుములా ఇవి గుర్తున్నాయా..?

కూటమి అభ్యర్థిగా గెలుపొంది ముత్తుముల అశోక్‌రెడ్డి ఎన్నికల సమయంలో నియోజకవర్గ ప్రజలకు పలు హామీలు ఇచ్చారు. సగిలేరు సప్లై ఛానల్ సమస్యల పరిష్కరిస్తారా లేదా చూడాలి. అదేవిధంగా గిద్దలూరు పట్టణ ప్రజలకు శాశ్వత మంచినీటి సమస్య పరిష్కారం కోసం నిధులు తెస్తారా వేచి చూడాలి. కంభం చెరువు పర్యాటక కేంద్రంగా అభివృద్ధి, పరిశ్రమల ఏర్పాటుకు కృషి జరుగుతుందా లేదో చూడాలి.

ఆ ఊర్లో చచ్చినా చావే.... !



వాగును దాటుకొని పొలం వెళ్తున్న కూలీలు (ఫైల్)



శవాన్ని ఎత్తుకొని వాగులో నుంచి వెళ్తున్న ప్రజలు (ఫైల్)

కంభం: ఆ గ్రామంలో వాగు పారుతుంటే ఊరి చివర ఉన్న శ్మశాన వాటికకు వెళ్లాలన్నా, రైతుల పొలాలకు వెళ్లాలన్నా, వ్యవసాయ కూలీలు కూలి పనులకు వెళ్లాలన్నా నానా తిప్పలు పడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నా ఎవరూ తమ సమస్యను పట్టించుకోవడం లేదని అక్కడి ప్రజలు వాపోతున్నారు. మండలంలోని రావిపాడు గ్రామంలో ఎవరైనా చనిపోతే శవాన్ని శ్మశాన వాటికకు తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించాలన్నా నానా తంటాలు పడాల్సి వస్తోంది. కంభం చెరువు నుంచి మార్కాపురం వైపునకు వెళ్లే గుండ్లకమ్మ వాగు రావిపాడు గ్రామం పొలిమేరల్లో నుంచి వెళ్తుంది. చెరువులో నీళ్ల లేని సమయంలో వాగు ఎండి ప్రజలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దాటుతుంటారు. చెరువులో నీళ్లు ఉన్న సమయంలో ఈ వాగు ఎప్పుడూ పారుతూనే ఉంటుంది. ఎప్పుడైనా పెద్ద పెద్ద వానలు కురిస్తే వాగు ఇంకా ఉధృతంగా పారుతూ రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది.

చచ్చినా చావే:

వాగు అవతల హిందువుల శ్మశాన వాటిక ఉంది. గ్రామంలో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలకు శ్మశాన వాటికకు వెళ్లాలంటే నానా తంటాలు పడాల్సి వస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. వాగులో నీళ్లు పారుతున్న సమయంలో భుజాల లోతు నీళ్లలో తంటాలు పడుతూ శవాన్ని మోస్తూ వాగు దాటాల్సిన దుస్థితి. చనిపోయిన వ్యక్తికి సంబంధించిన వారి బంధువుల్లో వృద్ధులు, వికలాంగులు ఉంటే అంత్యక్రియలకు కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఎన్నో ఏళ్లుగా గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నా ఎవరూ స్పందించడం లేదు.

- రావిపాడులో వాగుపారుతుంటే శ్మశాన వాటికకు వెళ్లలేని పరిస్థితి
- రైతులు పంట పొలాలకు వెళ్లాలన్నా తప్పని తిప్పలు
- వాగుపై వంతెన నిర్మించాలని కోరుతున్న గ్రామస్తులు

రైతులకు తప్పని తిప్పలు:

రావిపాడుతో పాటు పక్కనే ఉన్న కందులాపురం, నడింపల్లి, సైదాపురం, ఔరంగబాదు గ్రామాలకు చెంది రైతులకు గుండ్లకమ్మ అవతల పొలాలు ఉన్నాయి. సుమారు వెయ్యి ఎకరాలకు పైగా పొలాలు ఉండటంతో రైతులు నిత్యం ఈ మార్గం గుండా పంటపొలాలకు, కూలి పనులకు వెళ్తుంటారు. వాగు పారుతున్న సమయంలో పంటపొలాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. పంటలు పండిన తర్వాత పంటను, ధాన్యాన్ని ఇంటికి చేర్చుకోవాలన్నా ఇబ్బందులు తప్పడం లేదు. మరో మార్గంలో పంటను ఇంటికి చేర్చుకోవాలంటే మూడు కిలోమీటర్లు చుట్టూ తిరిగి రావాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు.



నడుము లోతు నీళ్లలో నుంచి వెళ్తున్న మహిళా కూలి (ఫైల్)



వంతెన నిర్మించాలి

ఎన్నో ఏళ్లుగా వాగుపై వంతెన నిర్మించాలని అడుగుతున్నా ఎవరూ స్పందించడం లేదు. పొలాలకు వెళ్లాలన్నా ఎవరైనా చనిపోతే శ్మశానానికి వెళ్లాలని ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఉన్నతాధికారులు స్పందించి వాగు పై వంతెన నిర్మించి సమస్యను పరిష్కరించాలి.

– అడపాల ఆంజనేయులు, రైతు, రావిపాడు



అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి

రావిపాడు గ్రామంలో సుమారు 4 వేలమంది జనాభా ఉన్నారు. ఎక్కువ మంది వ్యవసాయం మీదే జీవిస్తున్నారు. వాగుకు అవతల ఉన్న పొలాలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. వాగు పారుతున్న సమయంలో ఎవరైనా చనిపోతే వారి బాధలు వర్ణణాతీతంగా ఉన్నాయి. అధికారులు స్పందించి వంతెన నిర్మించేలా చర్యలు తీసుకోవాలి.

– పెద్దకోటేశ్వరరావు, రావిపాడు

చిత్తశుద్ధితో ప్రజా సమస్యలు పరిష్కరించాలి



గ్రీవెన్స్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

- గ్రీవెన్స్ నిర్వహించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు చిత్తశుద్ధితో ప్రజా సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ తమీమ్‌అన్సారియా సూచించారు. ప్రకాశం భవనంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక భవనంలో సోమవారం జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఇతర అధికారులతో కలిసి గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి సంబంధిత అధికారులకు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో నాణ్యత ఉండాలన్నారు. మొక్కుబడి పరిష్కారాలు కాకుండా క్షేత్ర స్థాయిలో పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. న్యాయపరమైన సమస్యలు పరిష్కరించడంలో అధికారులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రతి అర్జీని సంబంధిత ప్రధాన అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. దీనిలో డీఆర్ఓ విశ్వేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు వరకుమార్, ఝాన్సీలక్ష్మి ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

- మార్కాపురానికి చెందిన మల్లయ్య గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలిసి తన కూతురు వెంకటశివ పావనికి 5వ తరగతి గురుకుల పాఠశాలలో సీటు ఇప్పించాలని కోరుతూ అర్జీ అందజేశాడు. మార్కాపురం ప్రభుత్వ పాఠశాలలో తన కూతురు 5వ తరగతి చదువుతుందని, కుటుంబం పనుల నిమిత్తం హైదరాబాదు వెళ్తున్నామని, గురుకుల పాఠశాలలో సీటు ఇచ్చి హాస్టల్ వసతి ఏర్పడితే కుమార్తె చదువు ఆగకుండా చదువుకుంటుందని విన్నవించాడు.
- పామూరు మండలం తిరగలదిన్నె గ్రామానికి చెందిన పోకా హరికృష్ణ గ్రీవెన్స్‌లో అధికారులను కలిసి తన రోడ్డు నిర్మాణం కోసం కోల్పోయిన భూమికి నష్ట పరిహారం ఇప్పించాలని కోరుతూ అర్జీ అందజేశారు. గతంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు వేసే సమయంలో కొంత భూమి పోయిందని, ఇప్పుడు 167బి బైపాస్ రోడ్డు నిర్మాణంలో మరికొంత భూమి పోతోందని నష్టపరిహారం అందలేదని, ఇప్పించాలని కోరాడు.

పొగాకు చూర గరిష్టంగా రూ.180

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో పొగాకు చూర కొనుగోళ్లు చేస్తున్నట్లు ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. పొదిలి, టంగుటూరు కేంద్రాల్లో కొనుగోళ్లు జరుగుతున్నట్లు చెప్పారు. రెండు కేంద్రాల్లో చూర వేలం పాటలో 1519 బేళ్లు రాగా, 1259 బేళ్లు కొనుగోలయ్యాయని, 260 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారని తెలిపారు. పొదిలి కేంద్రంలో 105వ రోజు వేలం పాటలో 910 బేళ్లు రాగా, 704 బేళ్లు కొనుగోలయ్యాయి. 206 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో గరిష్టంగా రూ.136, కనిష్ట ధర రూ.60, సరాసరి రూ.72.12 పలికింది. టంగుటూరు వేలం కేంద్రంలో 111వ రోజు వేలం పాటలో 609 బేళ్లు రాగా, 555 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారని, 54 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో కేజీ గరిష్ట ధర రూ.180, కనిష్టంగా రూ.60, సరాసరి రూ.94.27 వచ్చిందని తెలిపారు.



టంగుటూరులో వేలంలో పాల్గొన్న వ్యాపారులు

క్లుప్తంగా

ఉరేసుకుని వ్యక్తి మృతి

కనిగిరి రూరల్: ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకుని మూలే బ్రహ్మానందరెడ్డి (34) మృతి చెందిన సంఘటన కనిగిరిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం పట్టణంలోని 8వ వార్డు బాదుల్లా వారి వీధిలో మూలే బ్రహ్మానందరెడ్డి దంపతులు నివసిస్తున్నారు. ఈ క్రమంలో భార్య పుట్టింటికి వెళ్లి చాలా రోజుల నుంచి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన బ్రహ్మానందరెడ్డి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకుని ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఈమేరకు మృతుడి తల్లి సుశీల సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై టీ త్యాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

గ్రానైట్ ఫ్యాక్టరీస్ అసోసియేషన్ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన గ్రానైట్ ఫ్యాక్టరీ అసోసియేషన్ సభ్యులు

చీమకుర్తి: చీమకుర్తి గ్రానైట్ ఫ్యాక్టరీస్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా కాట్రగడ్డ రమణయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం చీమకుర్తి పరిధిలో ఫ్యాక్టరీ యజమానుల సమక్షంలో నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా అహ్మద్‌బాషా, సభ్యులుగా కందిమళ్ల గంగాధర్, కోశాధికారిగా కర్నా సాయి, కార్యవర్గ సభ్యులుగా నూకల సురేంద్ర, రామకృష్ణను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రానున్న రోజుల్లో ఫ్యాక్టరీల అభివృద్ధి కోసం, యజమానులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కార్యవర్గం భరోసా ఇచ్చింది. అనంతరం నూతన కమిటీని ఫ్యాక్టరీల యజమానులు ఘనంగా సత్కరించారు.

ఇడ్లీ తిన్నాడు.. బిల్లు అడిగితే తన్నాడు!

మార్కాపురం: హోటల్‌కు వెళ్లి సర్వర్‌తో ఇడ్లీ తెప్పించుకుని పుష్టిగా ఆరగించిన ఓ యువకుడు బిల్లు చెల్లించాలని అడిగిన సిబ్బందిపై ఒక్కసారిగా దాడికి దిగాడు. ఈ సంఘటన సోమవారం మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఒక హోటల్లో చోటుచేసుకుంది. వివరాలు.. ఆర్టీసీ డిపో ఎదురుగా ఉన్న ఓ హోటల్లో కె.మహేష్‌రెడ్డి ఇడ్లీ తిన్నాడు. హోటల్ బాయ్ అంజి బిల్లు కట్టాలని కోరగా మహేష్ దాడికి దిగాడు. అడ్డుకోబోయిన హోటల్ సిబ్బంది పరమేశ్వరరెడ్డి, సుబ్బారెడ్డిపైనా మహేష్ దాడికి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ రెహమాన్ తెలిపారు.

మహిళలపై ఘోరాలు సిగ్గు సిగ్గు

- రాష్ట్రంలో గత 40 రోజుల్లో 20 మంది మహిళలు, చిన్నారులపై అకృత్యాలు
- సీఎం చంద్రబాబు షాక్ ట్రీట్‌మెంట్ ఇస్తానన్నా బెరుకు లేదు
- హోం మంత్రి అనిత 'ఆఖరి రోజు' అని హెచ్చరించినా ఫలితం లేదు
- చిరుద్యోగుల తొలగింపులను కూటమి ప్రభుత్వం ఆపాలి
- జిల్లా ప్లీనం సమావేశంలో విమర్శలు సంధించిన సీపీఎం నేతలు



సంతాపం తెలుపుతున్న సీపీఎం నాయకులు



కవి వెంకటరత్నం మృతికి నివాళిగా మౌనం పాటిస్తున్న సీపీఎం నాయకులు

ఒంగోలు టౌన్: మహిళలపై ఘోరాలకు పాల్పడేవారికి షాక్ ట్రీట్‌మెంట్ ఇస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కన్నెర్రజేసినా, స్త్రీలపై దాడులకు ఒడిగట్టే వారికి అదే చివరిరోజు అవుతుందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత హెచ్చరించినా ఫలితం ఏమాత్రం కానరావడం లేదని సీపీఎం నేతలు విమర్శించారు. ఆదివారం ఒంగోలులోని సుందరయ్య భవనంలో నిర్వహించిన జిలా ప్లీనం సమావేశంలో నేతలు ప్రసంగించారు. ఈ సందర్భంగా చర్చించిన ప్రజా సమస్యలు, చేసిన తీర్మానాలను ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సోమవారం విలేకర్లకు వెల్లడించారు. గత 40 రోజుల్లో రాష్ట్రంలో 20 మంది మహిళలు, బాలికలపై మానవ మృగాలు లైంగిక దాడులకు పాల్పడ్డాయని వివరించారు. వారిలో నలుగురు అత్యాచారానికి గురై పాశవికంగా హత్య చేయబడ్డారని తెలిపారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం సీరియస్‌గా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చిరుద్యోగులు, స్కీం వర్కర్ల మీద దాడులు ప్రారంభమయ్యాయని, ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఓఏ, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, మున్సిపల్, స్వచ్ఛ భారత్ కార్మికులు, రేషన్ డీలర్లు, అంగన్‌వాడీల్లో అనేక మందిని తొలగించి వారి స్థానంలో కొత్తవారిని నియమించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో ఫీల్డ్ అసిస్టెంట్లు 800 మంది ఉండగా 600 మందిని తొలగించి కొత్తవారిని పెట్టుకున్నారని, వెయ్యి మంది వీవోఏల్లో 200 మందిని కొత్తవారిని నియమించారని, మిగిలిన అన్ని మండలాల్లో కూడా తొలిగిపోవాలని ఒత్తిడి చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. 1200 మంది మధ్యాహ్న భోజన కార్మికుల్లో 300 మందిని, వెయ్యి మంది రేషన్ డీలర్లను తొలగించడంపై మండిపడ్డారు. జిల్లాలోని అంగన్‌వాడీల మీద కూడా ఒత్తిడి చేస్తున్నారని, వీరందరినీ యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. చీమకుర్తిలో మలేరియా కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని, యర్రగొండపాలెం, మార్కాపురంలో కూడా కేసులు పెరుగుతున్నాయన్నారు. రానున్న కాలంలో ఈ సమస్యలపై పోరాటాలు చేస్తామని జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరైన ఈ ప్లీనం సమావేశంలో జిల్లా నాయకుడు జీవీ కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అభ్యుదయ కవి, రచయిత అడిగొప్పుల వెంకటరత్నం మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు.

నంబర్ తొలగిస్తే పంబ రేగిద్ది!

- ఆర్టీఓ ఇచ్చిన నంబర్ ప్లేట్ మాత్రమే వాడాలి
- ఎలాంటి గుర్తులు, పేర్లు ఉండకూడదని వాహనదారులకు హెచ్చరిక
- 'సాక్షి' కథనంపై స్పందించిన పోలీసు యంత్రాంగం

సాక్షి ఎఫెక్ట్..



పొదిలిలో దగ్గరుండి స్టిక్కర్లు తొలగింపజేస్తున్న ఎస్సై కోటయ్య

ఒంగోలు టౌన్: ఒంగోలు నగరంలో మోటారు సైకిళ్లు, ఆటోలు, కార్ల యజమానులు ఆర్టీఓ కేటాయించిన నంబర్ ప్లేట్లు దుర్వినియోగం చేయడంపై 'ఇవి ఏ ఠాణా తాలుకానో' శీర్షికన 'సాక్షి'లో సోమవారం వచ్చిన కథనంపై జిల్లా పోలీసు యంత్రాంగం స్పందించింది. జిల్లా వ్యాప్తంగా పట్టణాలు, గ్రామాల్లో విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించిన పోలీసులు నంబర్ ప్లేట్లపై ఉన్న బొమ్మలు, కామెంట్లను అక్కడికక్కడే తొలగింపజేశారు. ఒరిజినల్ నంబర్ ప్లేట్లు లేని వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ క్రమంలోనే ఒంగోలు వన్‌టౌన్ టౌన్ సీఐ షేక్ ఆలీ సాహెబ్ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ నంబర్ కనిపించకుండా ఎలాంటి గుర్తులు కానీ, చిహ్నాలు కానీ, ఫలానావారి తాలుకా అని రాయకూడదని స్పష్టం చేశారు. అలాగే మోటారు సైకిళ్ల మీద ఇద్దరికి మించి ప్రయాణం చేయరాదని, మద్యం సేవించి వాహనాలు నడిపి ఇబ్బందులు కొనితెచ్చుకోవద్దని హితవు పలికారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాహనాలు నిలపాలని, వ్యాపారులు తమ షాపుల ముందు రోడ్ల మీద వాహనాలు నిలపకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

జాతీయ స్థాయి జూడో పోటీల్లో సత్తా చాటిన ఏపీ పోలీసులు



జిల్లా పోలీసు కార్యాలయంలో విజేతలను అభినందిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

- పోలీసు క్రీడాకారులను అభినందించిన ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: జూన్ 24 నుంచి 30 వరకు అస్సాంలో జరిగిన జాతీయ స్థాయిలో 9వ ఆల్ ఇండియా జూడో క్లస్టర్–2024 పోటీల్లో ఆంధ్రప్రదేశ్ పోలీసులు సత్తా చాటారు. వివిధ విభాగాల్లో మొత్తం 9 పతకాలను సాధించారు. అందులో ఒక బంగారు పతకం, సిల్వర్ మెడల్స్ 2, కాంస్య 6 పతకాలను సాధించి చరిత్ర సృష్టించిన పోలీసులను ఎస్పీ ఏఆర్ దామోదర్ జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం అభినందించారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ నుంచి పీనాక్ సిలాత్ పోటీలో పాల్గొన్న కె.చరణ్ తేజ (నెల్లూరు, ఏఆర్ పీసీ) అద్భుత ప్రదర్శనతో బంగారు పతకాన్ని సాధించారు. పెంచాక్ సిలాత్‌లో యం.రాజశేఖర్ (నెల్లూరు, హెచ్‌సీ) , తైక్వాండోలో కె.అరుణ్ కుమార్ (మన్యం పార్వతీపురం, పీసీ) సిల్వర్ మెడల్ దక్కించుకున్నారు. పెంచాక్ సిలాత్, కరాటే పోటీల్లో పి.కల్పన (కర్నూలు, డబ్ల్యూఆర్ఎస్ఐ), కరాటే పోటీలో నెల్లూరు జిల్లాకు చెందిన ఏ.శ్రావణి (నెల్లూరు, ఏఆర్ పీసీ) కాంస్య పతకాలు సాధించారు. కరాటే పోటీలో టి.పావని (వైజాగ్, మహిళా కానిస్టేబుల్), వి.ప్రియాంక (విజయవాడ, ఏఆర్ మహిళా ఏఆర్ మహిళా కానిస్టేబుల్) కాంస్య పతకాలను సొంతం చేసుకున్నారు. తైక్వాండోలో యస్.ఫరహతుల్లా (నంద్యాల, పీసీ) సాధించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఒంగోలులోని పోలీసు డిస్ట్రిక్ట్ ట్రెనింగ్ సెంటర్ (డీటీసీ)లో శిక్షణ పొంది తైక్వాండో, కరాటే, పెంచాక్ సిలాత్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన పోలీసులు డీటీసీకి మరింత పేరు తెచ్చారని కొనియాడారు. ఒకవైపు పోలీసులుగా విధులు నిర్వహిస్తూనే మరోవైపు నిరంతర సాధనతో క్రీడల్లో రాణించడం చాలా గొప్ప విషయమన్నారు. రాష్ట్ర పోలీసు శాఖకు గర్వకారణంగా నిలిచారని, భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలన్న ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- బ్రిడ్జిలు, రోడ్ల పరిశీలనలో కలెక్టర్ తమీమ్ అన్సారియా



బకింగ్ హాం కెనాల్‌పై బ్రిడ్జిని పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ఒంగోలు–కొత్తపట్నం రహదారిలో బకింగ్ హాం కెనాల్‌పై నిర్మించిన బ్రిడ్జిని సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణ ఎస్టిమేషన్లు, చేపట్టిన పనుల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న బ్రిడ్జి సేఫ్టీ వాల్, ఇతర పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం కొత్తపట్నం మండల కేంద్రంలో చేపట్టి అసంపూర్తిగా ఉన్న రోడ్ల నిర్మాణ పనులు పరిశీలించారు. పెండింగ్ నిర్మాణాలు పూర్తి చేసి డివైడర్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. అదే విధంగా టంగుటూరు మండలంలోని సూరారెడ్డిపాలెం రైల్వే క్రాసింగ్ నంబర్ 199 వద్ద నూతనంగా ఆర్ఓ బ్రిడ్జి నిర్మించనున్న ప్రదేశాన్ని కలెక్టర్ పరిశీలించారు. బ్రిడ్జి ఎస్టిమేషన్ వివరాలను తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఆర్‌అండ్‌బీ ఎస్ఈ దేవానందం, ఈఈ గోపినాయక్, తహసీల్దార్ హేమంత్ తదితరులు ఉన్నారు.

పోలీస్ స్పందనకు 92 అర్జీలు

- చట్టపరంగా న్యాయం చేస్తాం
- బాధితులకు ఎస్పీ ఏఆర్ దామోదర్ భరోసా



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేపట్టి బాధితులకు చట్టపరంగా న్యాయం చేస్తామని ఎస్పీ ఏఆర్ దామోదర్ భరోసా ఇచ్చారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 92 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి ఎస్పీ రాతపూర్వక అర్జీలు స్వీకరించారు. బాధితులతో నేరుగా మాట్లాడి సమస్య పూర్వాపరాలు తెలుసుకున్నారు. ఫిర్యాదులను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని, తగిన విచారణ జరిపి న్యాయం చేస్తామని చెప్పారు. అలాగే ఆయా పోలీసు స్టేషన్ల అధికారులతో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ విచారణ చేపట్టాలని, చట్టప్రకారం చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేకూర్చాలని ఆదేశించారు. ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, అడిషనల్ ఎస్పీ(క్రైం) ఎస్‌వీ శ్రీధర్‌రావు, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివరామకృష్ణ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సైలు పాల్గొన్నారు.

గురువులు త్రిమూర్తి స్వరూపులు




గురువులను సన్మానిస్తున్న సంస్కార భారతి నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: గురువులు త్రిమూర్తి స్వరూపులని సంస్కార భారతి ప్రకాశం జిల్లా శాఖ ప్రముఖ్ పత్తి రంగమన్నార్ పేర్కొన్నారు. గురు పౌర్ణమిని పురస్కరించుకుని కేశవస్వామిపేటలోని ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానం కల్యాణ మండపంలో నటరాజ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నాటకరంగ గురువు కళా ప్రకాశం అధ్యక్షుడు చిట్టా వెంకట శివప్రసాద్, సాహిత్య గురువు ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులు, కూచిపూడి నృత్య గురువు నళినీ ప్రియ కూచిపూడి నృత్య కళానికేతన్ అధ్యక్షురాలు ఎస్వీ శివకుమారి, సంగీత గురువు స్వరరాగ సుధ వ్యవస్థాపక కార్యదర్శి కుందుర్తి శ్రీనివాసమూర్తి, భగవద్గీత శిక్షణ గురువు చేవూరి విజయలక్ష్మికి పాద పూజ చేసి, ఘనంగా సత్కరించారు. నేటి తరానికి గురువు ప్రాధాన్యతను తెలియజెప్పాలనే ఉద్దేశంతో సంస్కార భారతి నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని రంగమన్నార్ కొనియాడారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రముఖ్ చంద్రశేఖర్, డాక్టర్ ప్రసాద్, రిటైర్డ్ లెక్చరర్ చిరంజీవి, కోటీస్ మాల్ అధినేత కోటి సూర్య నారాయణ, సంస్కార భారతి నిర్వాహకులు ఘోరకవి సంపత్ కుమార్, రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా నటరాజస్వామి విగ్రహానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన, శాస్త్రీయ సంగీత విభావరి ఆహూతులను అలరించింది.

ఉపాధి నిధులతో మూగ జీవాలకు షెడ్లు

- పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ కే బేబి రాణి



ఒంగోలు సెంట్రల్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథక నిధులతో మూగ జీవాలకు షెడ్ల నిర్మాణాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి బేబిరాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొదటి విడతలో 1075 షెడ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరైనట్లు చెప్పారు. అందులో మెరక మండలాలకు 825, తీర ప్రాంత మండలాల్లో 250 మంజూరయ్యాయన్నారు. పశువుల షెడ్ల నిర్మాణానికి 90 శాతం, జీవాలు, కోళ్ల షెడ్ల నిర్మాణానికి 70 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. దీనికి స్వంత భూమి, ఇంటి స్థలం ఉపాధి హామీ జాబ్ కార్డ్ ఉన్న చిన్న, సన్నకారు రైతులు అర్హులని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ సంచార జాతుల వారికి ప్రధాన్యత ఇస్తారన్నారు.

షెడ్ల నిర్మాణానికి సబ్సిడీ ఇలా...

పశువులకు	యూనిట్ ధర(రూ.)	సబ్సిడీ(రూ.)
రెండు పశువులకు	1,15,000	1,03,500
నాలుగు పశువులకు	1,85,000	1,66,500
ఆరు దాటితే	2,30,000	2,07,500
గొర్రెలు, మేకలు, కోళ్లకు..		
20 గొర్రెలు, మేకలు	1,30,000	91,000
50 గొర్రెలు, మేకలు	2,30,000	1,60,000
100 కోళ్లు	87,000	60,900
200 కోళ్లు	1,32,000	92,000

వల్లూరమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.24.38 లక్షలు



హుండీ కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన వల్లూరమ్మ ఆలయ హుండీ కానుకలు సోమవారం లెక్కించారు. మొత్తం 147 రోజులకుగాను 10 హుండీలు లెక్కించగా రూ.24,38,001 ఆదాయం వచ్చినట్లు ఈవో బి.రమేష్ వెల్లడించారు. కార్యక్రమంలో దేవాదయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలరావు, ఆలయ ప్రధాన అర్చకుడు నాగేశ్వరరావు, ఉప ప్రధాన అర్చకుడు ఉమాశంకర్, తెనాలి వాసవి సేవా సమితి సభ్యులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.